

రైతు నేస్తం ద్వారా అవగాహన

బజార్‌హత్నూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైతు వేదికలల్లో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కపాస్ కిసాన్ ఆప్, స్లాట్ బుకింగ్, తదితర అంశాలను దృశ్య శ్రవణం ద్వారా అవగాహన కల్పించారు. కాగా ఈ కొత్త ఆప్ వినియోగంలో రైతులకు ఇబ్బందులు తప్పవని స్థానిక రైతులు వ్యవసాయ అధికారి మొహమ్మద్ సౌద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎక్కువ మంది రైతులు చదువుకోలేదని, స్లాట్ బుక్ చేయడం తెలియదని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

తాంసి పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు
● వాయిపేట్ సెక్షన్ అధికారి

బుద్ధుడు చూపిన శాంతిమార్గంలో నడవాలి

వివరాలు 7వ పేజీలో.....

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): భూ భారతి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈనెల చివరి వారంలోగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి కార్యక్రమం ద్వారా రైతులు, దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించే దిశగా, దరఖాస్తుల పరిశీలనలో వేగంగా ముందుకు సాగాలని సూచించారు. ఆయా మాడ్యూల్‌లో దరఖాస్తులు ఎన్ని వచ్చాయి? ఎన్ని పరిష్కారమయ్యాయి? పెండింగ్, నోటీసులు ఇచ్చిన వాటి క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ, తదితర వాటిపై ఆరా తీసి గడువు పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ల వద్ద పెండింగ్ ఉన్న వివరాల తీరును ఆరా తీసి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాదాబైనామా, పీఓటీల కు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన ప్రక్రియ జరపాలని, వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్‌కు నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల పురోగతిపై సమీక్షించి త్వరగా పూర్తి చేయాలని తెలిపా రు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రాజేశ్వర్, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా



ముఖాముఖి

ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు వేర్వేరుగా సిరా మార్క్

● రాథోడ్ రవీందర్, జడ్పీ సీఈవో, ఆదిలాబాద్

ప్రశ్న: స్వల్ప వ్యవధిలోనే ఎంపీటీసీ జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ఉన్నాయి కదా.. అయితే, ఓటర్లకు సిరా మార్క్‌ను ఎలా వేస్తారు?

జవాబు: త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో వేర్వేరుగా వేలుకు సిరా మార్క్‌ను వేస్తారు. ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల్లో ఎడమ చేయి బొటనవేలు పక్కన ఉన్న వేలికి సిరామార్క్ వేస్తారు, సర్పంచ్ వార్డు నెంబర్ ఎన్నికల్లో ఎడమ చేయి చూపుడు వేలుకు సిరా మార్క్‌ను వేయాలని ఆదేశాలు వచ్చాయి.

ప్ర: జిల్లాలో ఎన్ని ఎంపీటీసీ జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.?

జ: జిల్లాలో 166 ఎంపీటీసీ స్థానాలు 20 జడ్పీటీసీ స్థానాలకు త్వరలోనే ఎన్నికలను నిర్వహిస్తాం.

ప్ర: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఎంత మంది సిబ్బంది అవసరం ఉంటుంది?

జ: రెండు దశల్లో ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహిస్తాం. మొదటి విడతలో బోథ్ నియోజక వర్గం, రెండవ విడతలో ఆదిలాబాద్ నియోజకవర్గంతో పాటు ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాలకు ఎన్నికలు జరుగుతాయి. మొత్తం 6244 మంది ఎన్నికల సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

ప్ర: జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎన్ని పోలింగ్ కేంద్రాలను గుర్తించారు?

జ: జిల్లావ్యాప్తంగా మొత్తం 877 పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నాం.

ప్ర: ఎన్నికలకు సరిపడా బ్యాలెట్ బాక్స్‌లు అందుబాటులో ఉన్నాయా?

జ: అవును.. ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలకు 1050 బ్యాలెట్ బాక్సులు అవసరం. కాగా ప్రస్తుతం 2350 బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి.

- (ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి)

దిగుబడిపై దిగాలు.. ధరపైనే ఆశలు

చేతికి వస్తున్న పంట దిగుబడులు

పత్తి పంటపై ఈ యేడు.. ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. దిగుబడులు భారీగా తగ్గిపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. మద్దతు ధర పైననే భారీగా ఆశలు పెట్టుకుంటున్నారు. జిల్లాలో సాగయ్యే పంటలలో ప్రధానంగా పత్తి పంట సాగు కనిపిస్తుంది. నల్లరేగడి నేలలకు అనువైన పంట కావడంతో రైతులు అధికంగా పత్తి పంటనే సాగు చేస్తున్నారు. ఈ యేడు వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంట ఏపుగా పెరిగి కనిపిస్తుంది. కానీ చేతికి వచ్చే దశలో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట ఎరుపుబారిపోయి జౌకుపట్టి పోతోంది. దీంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నదాతలు వాపోతున్నారు.



● పత్తి పంటను ఏరుతున్న రైతు కూలీలు

- జిల్లాలో ఈ యేడు అధిక వర్షాలతో పంటలపై తీవ్రప్రభావం
- సీసీఐ కఠినమైన నిబంధనలతో మద్దతు దక్కడం గగనమే
- కపాస్ కిసాన్ యాప్‌తో పత్తి రైతుల్లో ఆందోళన
- జిల్లావ్యాప్తంగా త్వరలోనే పత్తి పంట కొనుగోలకు అధికారుల ఏర్పాట్లు

ఆదిలాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాధారణ సాగువిస్తీర్ణం 5లక్షల 80వేల ఎకరాలు కాగా ఇందులో అత్యధికంగా 4లక్షల 31వేల ఎకరాలలో పత్తి పంట సాగవుతుంది. దీంతో ఎకరాన 8 క్వింటాళ్ల చొప్పున 33లక్షల 26వేల క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పుడిప్పుడే పంట దిగుబడులు చేతికి వస్తున్నాయి. దీంతో పత్తి కొనుగోళ్లను ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.ఈయేడు సీసీఐ ఆధ్వర్యంలో పత్తిపంటను కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 11కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. త్వరలోనే కొనుగోళ్లను ప్రారంభించే అవకాశం ఉంది. ఈసారి పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.8110గా ప్రభుత్వం నిర్ణయించింది. కానీ పంట నాణ్యత, తేమశాతం, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల ప్రభావంతో మద్దతు ధర దక్కడం గగనమేనన్న అభిప్రాయాలున్నాయి.

దెబ్బతింటున్న నాణ్యత

ఏకదాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో పత్తి పంటపై తీవ్ర ప్రభావం పడుతుంది. అధిక తేమతో కాతపూత నేలరాలుతుంది. చేతికొచ్చిన పత్తి నలుపుభారీ నాణ్యత లేకుండా పోతుంది. పత్తి కాయల నాణ్యత దెబ్బతినడంతో ధరలు పడిపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడు జూన్ నుంచి అక్టోబరు 7వరకు జిల్లా సాధారణ వర్షపాతం 1020.9 మి.మీ.లు కాగా అత్యధికంగా 1388.04 మి.మీ.ల వర్షం కురిసింది. జిల్లాలో నల్లరేగడి నేలలే అధికంగా ఉన్నాయి. కురుస్తున్న భారీ వర్షాలకు నల్లరేగడి నేలల్లో అధిక తేమ కారణంగా పంట భూములు జౌకుపట్టి పోతున్నాయి. కలుపు నివారణకు అవకాశం లేకపోవడంతో పత్తి పంటను కలుపు మొక్కలు కప్పేస్తున్నాయి. ఎకరాన కనీసం 5 నుంచి 6 క్వింటాళ్ల వరకైనా దిగుబడులు వచ్చే పరిస్థితి లేదని రైతులు పేర్కొంటున్నారు. దిగుబడులు తగ్గి పెట్టుబడి ఖర్చులు పెరిగి పోవడంతో నష్టాలే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇకనైనా వర్షాలు తగ్గుముఖం పడితేనే ఆశించిన దిగుబడులు చేతికి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

గత ఐదేళ్లుగా పత్తి ధరలిలా...		
2020-21	:	రూ.5,825
2021-22	:	రూ.6,025
2022-23	:	రూ.6,080
2023-24	:	రూ.7,020
2024-25	:	రూ.7,521
2025-26	:	రూ.8,110

జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం	5.80లక్షల ఎకరాలు
పత్తి పంట సాగు విస్తీర్ణం	4.31లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా	33.26లక్షల క్వింటాళ్లు
సీసీఐ కొనుగోలు కేంద్రాలు	11 కేంద్రాలు
జిన్నింగ్ మిల్లులు	34
క్వింటాలు పత్తి మద్దతు ధర	రూ.8110

తేమతో ధరల్లో కోతలు

సీసీఐ విధిస్తున్న కఠినమైన నిబంధనలతో పత్తి రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. ముఖ్యంగా తేమ శాతం పేరిట ధరల్లో కోతలు పెట్టడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. 8 నుంచి 12 తేమ శాతం ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. 8శాతం తేమ ఉన్న పత్తికి రూ.8110 మద్దతు ధరను చెల్లిస్తుంది. ఆపైగా ఒక్కో పాయింట్‌కు రూ.81.10 పైసల చొప్పున ధర తగ్గిస్తు వస్తుంది. గత ఐదేళ్లుగా పెరిగిన మద్దతు ధరలను పరిశీలిస్తే గరిష్టంగా రూ.2281 మాత్రమే పెరిగింది. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులతో ఏఒక్క రైతుకు మద్దతు ధర దక్కడం కష్టంగా నే కనిపిస్తుంది. ఎందుకంటే అక్టోబరు నుంచి జనవరి వరకు తేమ అధికంగా ఉండడంతో మద్దతు ధర దక్కే అవకాశమే ఉండదు. అలాగే తేమ, నాణ్యత పేరిట సీసీఐ కొనుగోళ్లకు కొర్రీలు పెట్టడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి పంటను అమ్ముకొనే పరిస్థితి ఎదురవుతుంది. అంతేకాకుండా ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో క్వింటాలు పత్తి రూ.5 వేల నుంచి రూ.7వేల లోపే ధర పలుకుతుంది. దీంతో పత్తి రైతులు భారీగా నష్టపోతున్నారు.

దిగొచ్చిన వ్యాపారులు

సీసీఐ జిన్నింగ్ మిల్లులను లీజుకు తీసుకునేందుకు టెండర్లను పిలిచింది. వ్యాపారులు తొలుత టెండర్‌లు వేసేందుకు ముందుకు రాలేదు. సీసీఐ

(తరువాయి 7వ పేజీలో....)

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ చేసే స్థానాలివే..

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జడ్పీటీసీ స్థానాలు, తొమ్మిది ఎంపీటీసీ స్థానాల్లో సీపీఐ పార్టీ అభ్యర్థులు బరిలో ఉండనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ బరిలో నిలిచే స్థానాలను ప్రకటించారు. బోథ్, ఆదిలాబాద్ రూరల్, తాంసి, నార్నూర్, భీంపూర్, మావల, భోరజ్ జడ్పీటీసీ స్థానాల్లో సీపీఐ బరిలో ఉంటుందని, బోథ్1, బోథ్ 2, అందూర్, బండల్ నాగాపూర్, తాంసి కప్పర్ల, తాంసి, భీంపూర్ వడూర్, భోరజ్ పెండల్వాడ, బాలాపూర్ ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.



గ్రామ పంచాయతీ ఈవోకు వినతిపత్రం ఇస్తున్న చిన్నారులు

బడికి పోదామంటే భయంగా ఉంది సారూ!

బోథ్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బోథ్‌లో కుక్కల బెడద తీవ్రమైందని, తాము బడికి వెళ్లాలంటే భయంగా ఉంది, గ్రామంలో రెండు రోజుల క్రితం దూడపై దాడి చేసి చంపి వేశాయి, కుక్కల నుంచి రక్షణ కల్పించాలంటూ మంగళవారం స్థానిక చిన్నారులు గ్రామ పంచాయతీ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. అలాగే, రైతులు సహితం కుక్కల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రాత్రి పూట పశువుల పాకలపై దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. స్పందించిన ఈవో తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని, కుక్కల సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



ఆదిలాబాద్‌లో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు



నేరడిగొండలో నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఉట్నూర్‌లో నివాళ్లర్పిస్తున్న జిల్లా రాయి సెంటర్ అధ్యక్షుడు మెస్రం దుర్గు పటేల్, ఆదివాసీ నాయకులు

మహనీయుల ఆశయ సాధనకు పాటు పడాలి

● కలెక్టర్ రాజర్షి షా ● జిల్లావ్యాప్తంగా కొమురం భీం 85వ వర్ధంతి ● ఘన నివాళ్లు అర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల సాధనే ధ్యేయంగా అలుపెరగని పోరాటాలు చేసిన మహనీయుడు కొమురం భీం అని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. స్థానిక బస్ స్టాండ్ ఎదుట కొమురం భీం 85వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పూజలు జరిపిన అనంతరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జల్, జంగల్, జమీన్ నినాదాలతో నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడు కొమురం భీం అని ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. భీం స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఆదివాసీల హక్కుల కోసం ప్రభుత్వంతో పాటు అధికార యంత్రాంగం సైతం పని చేస్తోందని తెలిపారు. ఐక్యంగా ఉంటూ ఆదివాసులు సమస్యలను సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్‌పీ కాజల్ సింగ్, డీఎస్‌పీ జీవన్ రెడ్డి, ఆదివాసీ సంఘాల నేతలు సిడాం రాం కిషన్ పాల్గొన్నారు.



ఇచ్చోడలో నివాళ్లర్పిస్తున్న తుడుందెబ్బ నాయకులు

● కొమురం భీం అందరికీ ఆదర్శం : ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ: జల్ జంగల్ జమీన్ పోరాట యోధుడు, ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం 85వ వర్ధంతి సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండలో గల తన నివాసంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురం భీం పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో నిండాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను సాధించే దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కొమురం భీం జ్ఞాపకార్థం గత ప్రభుత్వం జోడేఘాట్లో రూ.25 కోట్లతో మ్యూజియం ఏర్పాటు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇచ్చోడ: ఆదివాసీల హక్కుల సాధనే ధ్యేయంగా అలుపెరగని పోరాటాలు చేసి న కొమురం భీం ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని తుడుం దెబ్బ నాయకులు అన్నారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని కొమురం కాంప్లెక్స్‌లోని కొమురం భీం 85వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు మెస్రం శంభు, కుంరం కోటేష్, ఆత్రం మహేందర్, మాడవి భీంరావ్, కాత్లె విఠల్, పవన్, మురళీకృష్ణ, ప్రకాష్, రమేష్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

● ఉట్నూర్‌లో భీంకు ఘన నివాళి

ఉట్నూర్: ఆదివాసీ గిరిజనుల హక్కుల పోరాట వీరుడు, జోడేఘాట్ అమరుడు, జల్ జంగల్ జమీన్ ప్రదాత కొమురం భీం చరిత్ర ఆదివాసీ గిరిజనుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిందని

మరిన్ని వివరాలు 7లో....



వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు



కౌటా(బి)లో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్థులు

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు కలెక్టర్‌లు శ్యామలాదేవి, రాజేశ్వర్, సబ్ కలెక్టర్ యువరాజ్, అదనపు ఎస్పీ కాజల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కౌట(బి) గ్రామంలో మంగళవారం వాల్మీకి జయంతిని గ్రామ అభివృద్ధి కమిటీ, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాస్, జెట్టి రాజేశ్వర్, ముత్యం, రమణ తదితరులున్నారు.

సీజేఐపై దాడి పట్ల న్యాయవాదుల ఖండన

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి ఘటనలకు చోటు లేదని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్రాల నగేష్ స్పష్టం చేశారు. సీజేఐ పై జరిగిన దాడికి నిరసనగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. దాడి చేసిన న్యాయవాదిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం అసోసియే షన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ మాట్లాడారు.



నిరసన తెలుపుతుతున్న న్యాయవాదులు

పీహెచ్‌సీకి చేయూత అభినందనీయం : డీఎంహెచ్‌వో



భీంపూర్ పీహెచ్‌సీలో సోలార్ ఇన్వర్టర్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

భీంపూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ పీహెచ్‌సీకి వైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ విజయసారథి ఆ పీహెచ్‌సీకి రూ. నాలుగు లక్షల విలువైన సోలార్ ఇన్వర్టర్ బహూకరించటం గొప్ప విషయం అని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. భీంపూర్ పీహెచ్‌సీలో మంగళవారం ఆయన దాతలైన డాక్టర్లు విజయసారథి, కౌస్తభ సహా, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధనలతో కలిసి సోలార్ ఇన్వర్టర్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీంపూర్ పీహెచ్‌సీ జాతీయ స్థాయి అవార్డుకు విజయసారథి పాత్ర ఎంతో ఉందన్నారు. విజయసారథి పేదల పాలిటి దేవుడన్నారు. డాక్టర్లు, సిబ్బంది మరింత సమర్థవంతంగా వైద్య సేవలు అందించాలన్నారు. పేదలు సర్కారు ఆసుపత్రులకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో బాలింతలు, నవజాత శిశువుల వివరాలను తెలుసుకున్నారు. సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. జానపద పాటలు పాడారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఇందులో డాక్టర్లు శ్రీధర్, నిఖిల్ రాజ్, జ్ఞానేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

● వైద్య సిబ్బందికి దిశా నిర్దేశం

ఆదిలాబాద్ టౌన్: నవజాత శిశు మరణాలను తగ్గించేదుకు వైద్యారోగ్య శాఖ పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని డీఎంహెచ్‌ం డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. పట్టణంలోని శాంతినగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆశాలు, ఏఎన్‌ఎంలు, ఇతర వైద్య సిబ్బందికి వివిధ అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ మేరకు డీఎంహెచ్ంవో మాట్లాడుతూ.. జిల్లాలో నవజాత శిశు మరణాల సంఖ్యను తగ్గించే విధంగా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్‌సీడీఎస్ వ్యాధుల స్క్రీనింగ్, తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశామన్నారు. ఇటీవల దగ్గు మందు తాగి పలువురు చిన్నారులు ఇతర రాష్ట్రాల్లో మృతి చెందడం బాధకరమని, పిల్లలకు దగ్గు అత్యంత సాధారణమని, రెండు రోజుల పాటు తగు జాగ్రత్తలు తీసుకుంటే తగ్గుతుందన్నారు. ఆ తర్వాత తగ్గకపోతే గుర్తింపు పొందిన వైద్యులను సంప్రదించి మందులు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.



వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

గోదావరి నది తీరంలో స్వచ్ఛభారత్

• వ్యర్థాలను తొలగింపు

బాసర, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): గణపతి, దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం తర్వాత నది తీరాలకు చేరిన వ్యర్థాలను యువతీ, యువకులు తొలగించేందుకు స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఠాకూర్ రాణి, ఎర్రం అఖిల్‌తోపాటు కొంతమంది స్థానిక యువకులు గోదావరి మాతకు మళ్లీ గౌరవం తేవాలనే సంకల్పంతో నది తీరాన్ని శుభ్రంచేశారు. సుమారు 2గంటల పాటు సాగిన ఈ చెత్త తొలగింపు కార్యక్రమంలో యువత ప్రదర్శించిన చురుకుదనం చూసి స్థానికులు ప్రశంసలు కురిపించారు. నదీ తీరాన్ని శుభ్రం చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

దిలావర్‌పూర్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్గాపూర్‌లో బుధవారం ఉచిత మెగా హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి డా.నారాయణ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రామంతాపూర్ ప్రభుత్వ హోమియో కళాశాలకు చెందిన వైద్యసిబ్బంది చికిత్సలు అందజేస్తారని పేర్కొన్నారు. కీళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం, ఇతర వ్యాధులకు సంబంధించి చికిత్సలు అందజేసి మందులను ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

ధ్రువపత్రాల అందజేత

సోన్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): దోప్ స్టిక్స్ తయారీ ట్రైనింగ్ పూర్తి చేసిన మహిళలకు ధృవపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు శైలజ, రిసోర్స్‌పర్సన్ లక్ష్మీ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ రవి, మాస్టర్ ట్రైనర్ అలేఖ్య, మహిళలు పాల్గొన్నారు.

కంటి పరీక్ష శిబిరాల ఏర్పాటు

నిర్మల్ రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఐ సైట్ డే దినోత్సవం సందర్భంగా ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కంటి పరీక్ష శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆశాకార్యకర్తల కంటి పరీక్షల శిబిరాన్ని మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ పరిశీలించారు. సమావేశంలో వైద్య విధాన పరిషత్ జిల్లా సూపరిండెంట్ డాక్టర్ సురేష్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ లక్ష్మీకాంత్, ఎల్వీప్రసాద్ కోఆర్డినేటర్ సాయన్న, ఆశాకార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

'గవాయ్‌పై దాడిని ఖండిస్తున్నాం'

నిర్మల్‌రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మతోన్మాద లాయర్ షూ విసిరి దాడికి యత్నించడం హేయమైన చర్యని, ఈ దాడిని ఖండిస్తున్నామని బహుజన్ సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత న్యాయవ్యవస్థకు ఇది చీకటి రోజన్నారు. బహుజనులు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా మారాలని అన్నారు. అందుకు వేదికగా బహుజన్ సమాజ్ పార్టీని స్వీకరించి బలోపేతం చేసుకుని రక్షణ పొందాలన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు జోసెఫ్, గంగారాం, లక్ష్మీయాదవ్, రాజేష్, పూజ, నాయకులు ఉన్నారు.



ముథోల్‌లో వర్షంలో తడుస్తున్న సోయా దిగుబడులు



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



దిలావర్‌పూర్‌లో నీట మునిగిన చెరువులను తలపిస్తున్న పొలాలు



సదర్మాట్ వద్ద ప్రమాద కరంగా ప్రవహిస్తున్న గోదావరి నది

ముథోల్‌లో భారీ వర్షం

» కల్లాల్లోనే తడిసిన సోయా దిగుబడులు
» ఆందోళనలో రైతన్నలు
» ముథోల్‌లో రాళ్ల చెరువుకు గండి

ముథోల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రైతులు కల్లాల్లో ఆరబెట్టిన సోయా దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. కొన్నింటికి మొలకలు సైతం రావడంతో రైతన్నలు కలవర పడుతున్నారు. చేతికొచ్చిన సోయాపంట కళ్లముందే నష్టపోతే అప్పులు తీర్చేది ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి కురిసిన భారీవర్షం రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేసింది. ఇటీవలే సోయా పంటలను కోసి కల్లాల్లో ఆరబెట్టిన రైతులు, వానకారణంగా ఆ దిగుబడులు పూర్తి తడిసిపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం తుఫాను మాదిరిగా కురవడంతో పలు గ్రామాల్లో కల్లాల్లో నీరు చేరి సోయా గింజలు తడిసి కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రాళ్ల చెరువుకు గండి

మండలకేంద్రంతోపాటు మండలంలోని వెంకటాపూర్, చించాల, తరోడా, ఆష్టా, రాంటెక్, ముద్గల్, విట్టోలి, బోరిగాం, కారేగాం, ఎడ్‌బిడ్, చింతకుంట గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ముథోల్‌లోని రాళ్ల చెరువుకు పెద్దగండి పడింది. చెరువును మంగళవారం రెవెన్యూశాఖ అధికారులు పరిశీలించి, చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సమాచారమిచ్చారు. మండలంలోని ఆయాగ్రామాల్లో రైతులు కేవలం 30శాతం మాత్రమే సోయా పంటను కోశారు. మిగతా 70శాతం సోయా పంట కోతకు సిద్ధంగా ఉన్నప్పటికీ వర్షం కారణంగా కోయలేకపో తున్నామని రైతులు పేర్కొంటున్నారు.

దిలావర్‌పూర్‌లో నీట మునిగిన పొలాలు

దిలావర్‌పూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు అన్నదాతను అప్పుల అగాధంలోకి నెట్టేస్తున్నాయి. పెట్టుబడుల కోసం అప్పులు చేసి సాగుకు శ్రీకారం చుట్టిన రైతన్నకు ఆది నుంచి అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికే వర్షాలతో పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పంట లు నాశనం కాగా తాజాగా మంగళవారం తెల్లవారు జా మున కురిసిన భారీ వర్షం వరి పొలాలను నాశనం చేసింది. భారీ వరద నీటితో వరి పొలాలు నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే కంకి వేసి పూత దశలో ఉన్న వరి నీటి మునగడంతో రైతుల దయనీయంగా మారింది. సర్వే చేసి ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కుంటాల మండలంలో భారీ వర్షం

కుంటాల: కుంటాలలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా మండలంలోని చెరువులన్నీ మరోమారు నిండి అలుగుల నుంచి భారీగా నీరు ప్రవహించింది. అందకూర్ అలుగు చెరువు నీటితో కల్లూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కోత దశలో ఉన్న పంటలన్నీ వర్షానికి దెబ్బతింటున్నాయి.

నర్సాపూర్(జి)లో 72.2 మిల్లీమీటర్ల వర్షం

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) మండలంలో సోమవారం రాత్రి కురిసిన కుండపోత వర్షం కురిసింది. ఏకంగా 72.2 మిల్లీమీటర్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదైంది. ఈ జలవిలయం మండలాన్ని అతలాకుతలం చేసింది. ఈ వర్షానికి మండలంలోని పరిసర ప్రాంతాల్లోని వరి, పత్తి, సోయా పంట పొలాలన్నీ పూర్తిగా నీటమునిగి, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరి ఆస్తి నష్టం సంభవించింది. వరద నీరు ఉధృతికి నందన్, భామ్ని(బి)లకు వెళ్లే మార్గాలు మునిగిపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. వర్షాలు కొనసాగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీకాంత్ సూచించారు.

తడిసి ముద్దవుతున్న మక్కలు

మామడ: ఎకధాటి వర్షాలతో మొక్కజొన్న పంట తడిసి ముద్దవుతోంది. రోజూ మబ్బులు, వర్షాలతో కురుస్తుండడంతో నెలరోజుల నుంచి ఇదే దుస్థితి నెలకొంది. 10శాతం రైతులు మాత్రమే పంటను విక్రయించారు. మిగతా రైతుల పంట రోడ్లపై ఆరబెడుతూ నానా అవస్థలు పడుతున్నామని, కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

సదర్మాట్‌కు భారీగా వరద

ఖానాపూర్: సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఖానాపూర్ మండలంలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఉరుములు,మెరుపులతో కూడిన పిడుగులకు జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఈ భారీ వర్షానికి వాగులు, ఒర్రెలన్నీ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. సదర్మాట్‌కు భారీగా వరద నీరు తరలివస్తుండడంతో సదర్మాట్ వద్ద గోదావరి నది నీటి మట్టం 11 అడుగులకు చేరింది. సదర్మాట్ వద్ద రాతి మత్తడి పైనుండి వరద నీరు గోదావరిలోకి ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో ఆనకట్టవైపు ఎవరు వెళ్లకుండా ఆనకట్ట అధికారులు గేట్లకు తాళం వేశారు. ఖానాపూర్‌లో ఉత్తర వాహిని గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ భారీ వర్షాలతో పంటలకు సైతం నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొలంలో పేరుకున్న ఇసుక మేటలు



కుంటాలలో ఉధృతంగా ప్రవహిస్తున్న కల్లూరు వాగు

మొక్కజొన్నకు మొలకలు



కుభీర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల కేంద్రానికి చెందిన కందూర్ సాయినాథ్, బషీర్ మొక్కజొన్న కంకుకు రోజూ వర్షానికి తడిసి కంకులను మొలకలు వస్తున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.



నల్లబారిన తెల్లబంగారం..

కుభీర్ మండలంలో పత్తి పంట పూర్తిస్థాయిలో దెబ్బతిన్నది. మండలంలో సుమారు 23వేల ఎకరాల్లో పత్తి సాగు కాగా 60శాతం నల్లరంగులోకి మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యసాయ శాఖ సర్వేలు చేపట్టి ఎకరాకు రూ.30వేలు ఇవాలని కోరుతున్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న అధికారి వినోద్ కుమార్

పంటను పరిశీలించిన వ్యవసాయాధికారి

సోన్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో గల వరి పంటలను మండల వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ పరిశీలించారు. వరి పంటలకు బ్యాక్టీరియా, ఎండాకు తెగుళ్ల ఆశించడాన్ని గమనించినట్లు తెలిపారు. నివారణకు పొటాష్ చల్లుకోవాలని, నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. పొలాన్ని ఆరబెట్టాలన, ప్లాంటోమైసిన్ 100గ్రాములు ఎకరానికి 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. ఆయనవెంట రైతులు వేణు, గౌతమ్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఎంపీడీవోకు ఫిర్యాదు

నర్సాపూర్(జి), అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్(జి) గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్‌బీఎం) నిధులలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ స్థానిక నివాసి మహమ్మద్ జాబీర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పుష్పలతకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో వాల్ పెయింటింగ్‌లు, వాల్ రైటింగ్‌లు, 3డీ డిజైన్‌ల పనులు చేయకపోయినా, 2024 మార్చి 18 నాటి రికార్డులలో నకిలీ బిల్లులు సృష్టించి నిధులను అధికారులు స్వాహా చేశారని జాబీర్ పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన పత్రాల ఆధారంగానే ఈ అవకతవకలు స్పష్టమవుతున్నాయని, తక్షణమే వివరణాత్మక దర్యాప్తు చేయాలని ఎంపీడీవో పుష్పలతను కోరారు.

ట్రస్మా సంఘం ఆధ్వర్యంలో డీఎస్‌డీవోకు సన్మానం

నిర్మల్‌రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా డీఎస్‌డీవోగా నియమితులైన దయానంద్‌ని నిర్మల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బీఏఎస్ స్కూల్‌కు రావాల్సిన బకాయిలను గురించి సాధక బాధకాలను వారితో వివరించారు. కార్యక్రమంలో విజయ హైస్కూల్ కరస్పాండెంట్ నాగభూషణ్, రవి హైస్కూల్ ఇన్‌చార్జి లెలీనా, ఆఫీష్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఎన్నికలకు ముందే కరువు భత్యం మంజూరు చేయండి'

నిర్మల్‌రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే కనీసం 2 డీఏలను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని ఉద్యోగఉపాధ్యాయులుగా ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నామని, రాష్ట్రప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు 5డీఏలు ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వం పట్ల సహనంగా ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అర్థం చేసుకొని ఉద్యోగుల పక్షపాతిగా నిలబడాలని ఆయన ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్, జీపీఎఫ్, టీస్ జీఎల్ఐ, డీఏ ఏరియర్ బిల్లులన్నింటికీ నిధులను మంజూరు చేయాలన్నారు. పదవీ విరమణ పొందిన వారికి మానిటరీ బెనిఫిట్స్ తొందరగా అందే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్న, గౌరవ అధ్యక్షులు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్ల చిన్నయ్య, నవీన్ కుమార్, నర్సయ్య, మొదలగువారు పాల్గొన్నారు.



సారంగాపూర్‌లో కొమురంభీమ్ విగ్రహానికి నివాళ్లర్పిస్తూ..



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



నివాళులర్పిస్తున్న తుడుందెబ్బ జిల్లా కమిటీ నాయకులు



కొమురం భీమ్, వాల్మీకి చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొమురంభీంకు ఘన నివాళి

కొమురంభీం 85వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. చరిత్రలో కొమురం భీం ఓ గొప్ప పోరాట యోధుడని పలువురు నాయకులు పేర్కొన్నారు. కొమురం భీమ్ పోరాటం జల్ జంగల్ జమీన్ నినాదంతో నిజాం పాలకులకు వ్యతిరేకంగా సాగిందని గుర్తు చేశారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం నేటి తరానికి నిరంతరం స్ఫూర్తిని స్తాయని కొనియాడారు.

• నెట్‌వర్క్



ఎడ్‌బిడ్‌లో నివాళ్లర్పిస్తున్న నాయకులు



కొమురంభీం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న తుడుందెబ్బ నాయకులు

'స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయభేరి మోగిద్దాం'

భైంసా,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాలు, పకడ్బందీ చర్యలతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయభేరి మోగిద్దామని బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధులు విలాస్ గాదేవార్, లోలం శ్యామ్ సుందర్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్‌ఆర్ గార్డెన్స్‌లో భైంసా మండల పార్టీ శ్రేణులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సదస్సు నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన వైఫల్యాలతో ప్రజలంతా విసిగెత్తిపోయారని విమర్శించారు. ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పేందుకు అన్ని వర్గాల ప్రజానీకం సిద్ధమైందన్నారు. ప్రస్తుతం ఎక్కడికి వెళ్లిన కేసీఆర్ పాలన ప్రస్తావననే వినవస్తోందన్నారు. పార్టీ శ్రేణులన్నీ ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఎవరైనా వారి గెలుపే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, బాకీలపై కార్డు రూపంలో ప్రదర్శించారు. ఇందులో పార్టీ ప్రతినిధులు, శ్రేణులు పాల్గొన్నాయి.

అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

సారంగాపూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం డీఎఫ్‌వో నాగిని, భాను, ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలో ఎఫ్‌ఆర్‌వో రామకృష్ణ, నజీర్‌ఖాన్, అరుణ్‌కుమార్,లతో పాటు అటవీశాఖ అధికారులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ వన్యప్రాణులను రక్షించే బాధ్యత ప్రతీఒక్కరిదని అన్నారు. అనంతరం వన్యప్రాణులపై అవగాహన కల్పించారు.

ఆవాస కేంద్రం తనిఖీ

భైంసా, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): భైంసాలోని శ్రీ వివేకానంద నిరాశ్రిత బాలుర అవాసకేంద్రాన్ని మంగళవారం జిల్లా న్యాయాధికారి రాధిక తనిఖీచేశారు. నిర్వహణ వ్యవస్థను పరిశీలించారు. అవాసంలోని విద్యార్థుల వసతి, సౌకర్యాలను పర్యవేక్షించారు. వంట గది, భోజన, తాగునీరు, నిర్వహణ రికార్డులు తదితర వాటిని పరిశీలించారు. పలు వివరాలను అవాస అధ్యక్షుడు శైలేష్ మహాశెట్టివార్, ప్రముఖ్ లింగారెడ్డిలను అడిగి తెలుసుకున్నాను. నిర్వహణ తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అవాస విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్ది వారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేయాలని నిర్వాహకులకు సూచించారు.

చిన్నారిపై కోతుల దాడి

» కోతులను అరికట్టడంలో అధికారులు విఫలం
» ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కడెం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఓ చిన్నారిపై కోతులు దాడి చేసి గాయపర్చాయి. కడెం మండల కేంద్రానికి చెందిన రఫీక్ కూతురు రిబాపై కోతులు దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. ఇంటి వద్ద ఆడుకుంటున్న పాపపై కోతులు ఒక్కసారిగా దాడి చేయడంతో గమనించిన కుటుంబీకులు రీబాను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కోతుల బెడదపై మండల కేంద్రప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, ఎన్నిసార్లు అధికారులను విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని, పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చెరువులో దూకి ఇద్దరు అన్నదమ్ముల మృతి

» నిర్మల్ జిల్లా కేంద్రంలో విషాదం



నరేష్ (ఫైల్)



నవీన్ (ఫైల్)

నిర్మల్‌రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాకేంద్రంలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. నిర్మల్ పట్టణ శివారులోని బంగల్‌పేట్ చెరువులో పడి అన్నదమ్ములు మృతిచెందిన ఘటన అందరినీ కలచివేసింది. సీఐ ప్రవీణ్ కుమార్, స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని నాయుడువాడకు చెందిన నరేష్(38), నవీన్(36) ఇద్దరు అన్నదమ్ములు. అమ్మ, నాన్న, భార్య పిల్లలతో కలిసి జీవనం కొనసాగిస్తున్నారు. వృత్తిరీత్యా నరేష్ ఓ ప్రైవేట్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. నవీన్ వ్యాపా రం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుడప్పుడు కుటుంబంలో చిన్నచిన్న గొడవలు జరిగేవి. మంగళవారం ఇంట్లో గొడవ జరగడంతో నరేష్ మనస్తాపానికి గురై... క్షణిక ఆవేశంలో బంగల్‌పేట్ వినాయక సాగ ర్ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అన్న వెనుకాలే వెళ్లిన నవీ న్ కాపాడేందుకు తాను చెరువులో దూకాడు. దీంతో ఇద్దరు చెరువులో మునిగిపోయి మృతిచెందారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. జాలర్లతో మృతదేహాలను బయటకు తీయించారు. కేసు నమోదు చేసి, మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతులు నరేష్‌కు భార్య, ఏడు సంవత్సరాల కుమారుడు, మూడు సంవత్సరాల కుమార్తె. నవీన్‌కు భార్య, మూడు సంవత్సరాల కుమార్తె ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

కుభీర్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుభీర్‌కు చెందిన ముచ్చిండ్ల గణేష్ (23) పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందినట్లు ఎస్సై కృష్ణరెడ్డి తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్ కొన్నిరోజులుగా ఏ పనీ లేకుండా తాగుడికి బానిసై జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తన ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 2 గంటల సమయంలో మృతిచెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు లారీ బోల్తా

భైంసారూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ గ్రామసమీపంలో ప్రమాదవశాత్తు లారీ బోల్తాపడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ నుంచి వైట్ సిమెంట్ రాళ్లను వైజాగ్‌కు వెళ్తుండగా మంగళవారం వానల్‌పాడ్ గ్రామసమీపంలో ప్రమాదవశాత్తు లారీ డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం డ్రైవర్, క్లీనర్లను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శంకర్ తెలిపారు.



బోల్తా పడిన లారీ

మహనీయుల ఆశయ సాధనకు పాటు పడాలి


అంబుగావ్‌లో భీంకు నివాళులర్పిస్తున్న గిరిజనులు


రాయిగూడలో మహిళా కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి


ఇంద్రవెల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

(5వ పేజీ తరువాయి...)

మానవ హక్కుల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు ఆత్రం భుజంగారావు అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో నెలకొల్పిన కొమురం భీం విగ్రహానికి ఆదివాసీ గిరిజన మహిళలతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇది ఇలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమురం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిదాత కొమురం భీం వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని వీరత్వానికి నివాళులర్పిస్తున్నామని యువజన కాంగ్రెస్ నాయకులు ఆత్రం రాహుల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్ రావు లు అన్నారు. ఈ కార్యక్రమంలోమెస్రం భాగ్య లక్ష్మీ, ఆత్రం తిరుపతి, మడావి మొతి రాం, ఆదివాసీ నాయకులు మెస్రం జైవంత్ రావు పాల్గొన్నారు. అలాగే, ఉమ్మడి జిల్లాలోని ఆదివాసుల హక్కుల రక్షణ కోసం పోరాడి అమరుడైన వీరుడు కొమురం భీం అని ఉమ్మడి జిల్లా రాయి సెంటర్ అధ్యక్షులు మెస్రం దుర్గు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణంలో ఉన్న భీమ్ గ్రహానికి ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందులో ఆదివాసీ


బజార్‌హత్నూర్‌లో భీం వర్ధంతిలో పాల్గొన్న గ్రామస్థులు

సంక్షేమ పరిషత్ నాయకులు పంద్రాజైవంత్ రావు, రాజ్ గోండు సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోడం నిరంజన్, తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పురక బాపురావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు దాదే రావు, మెస్రం గంగారాం, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఉట్నూర్ భీం ప్రాంగణంలో ఉన్న భీము విగ్రహానికి బీజేపీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గిరిజన ఆరాధ్య దైవం కొమురం భీమ్ వర్ధంతి. మండల కేంద్రంలోని జిల్లా ఆస్పత్రి ఆవరణలో వైద్యులు సిబ్బంది కొమురం భీం చిత్రపటానికి రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కేబీ కాంప్లెక్స్‌లో గిరిజనుల ముద్దుబిడ్డ కొమురం భీమ్ వర్ధంతి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు.

తాంసి: ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ వర్ధంతిని మంగళవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అంబుగావ్ గ్రామంలో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిరికొండ: కొమురం భీమ్ గొప్ప పోరాట యోధుడు అని రాష్ట్ర ఎస్సి ఎస్టీ, కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి అన్నారు. మండలంలోని రాయిగూడలో భీం విగ్రహానికి పులమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు.

ఇంద్రవెల్లి: భీం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా కోశాధికారి కోట్నాక్ బారిక్‌రావు అన్నారు. భీం వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అదేవిధంగా, భీంపూర్, బజార్‌హత్నూర్, తలమడుగు, బోథ్, నార్నూర్ మండలాలతో పాటు జిల్లాకేంద్రంలోని ఆయా పార్టీల ఆధ్వర్యంలో కొమురం భీం వర్ధంతి సందర్భంగా ఘన నివాళ్లర్పించారు.

దిగుబడిపై దిగాలు.. ధరపైనే ఆశలు

(5వ పేజీ తరువాయి...)

నిబంధనలపై వ్యాపారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా దూది శాతం నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు. క్వింటాల్ పత్తి నుంచి సుమారుగా 33 శాతం వరకు దూదిని(లింట్) తీయాలన్న నిబంధన ఉంది. దీనిపై వ్యాపారులు, సీసీఐ మధ్య విభేదాలు తలెత్తాయి. దీనిని కూడా నెలవారీగా మార్చడం పై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అలాగే ఎల్1, ఎల్2, ఎల్3 విధానంతో వ్యాపారులు నష్టపోయే అవకాశం ఉందని ఈ నిబంధనను సడలించాలంటూ సీసీఐ పై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో లీజు టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది. పత్తి పంట చేతికి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారులు, సీసీఐ మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించగా కొనుగోళ్లకు మార్గం సుగుమమైంది.

పత్తి రైతులకు యాప్ తిప్పలు

పత్తిని కొనుగోలు చేసేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అందు బాటులోకి తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్‌తో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో పంట దిగుబడుల రద్దీని తగ్గించి పత్తి కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే పత్తిని సీసీఐకి విక్రయించే రైతులు వారం రోజుల ముందుగానే ఈ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. ఆ తర్వాతనే కొనుగోలు కేంద్రానికి పంటను తరలించి అమ్ముకోవాల్సి ఉంటుంది. ప్రతీ రైతు ఆండ్రాయిడ్ ఫోన్‌ను తప్పనిసరిగా కలిగి ఉండి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీని ద్వారానే పత్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కానీ గ్రామాల్లో చాలా మంది రైతులకు ఇప్పటికీ స్మార్ట్ ఫోన్లు అందుబాటులో లేవు. దీంతో ఇతర రైతులపై ఆధారపడాల్సి వస్తుంది. ముఖ్యంగా కౌలు రైతులు పత్తిని అమ్ముకోవాలంటే భూ యజమానుల సహకారం తప్పనిసరిగా మారింది.

బుద్ధుడు చూపిన శాంతిమార్గంలో నడవాలి

ఇంద్రవెల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు చూపిన శాంతి మార్గంలో నడిచి ప్రశాంత జీవనం గడపాలని పూజ్య భంతే కమల్ ధమ్మో సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని సట్వాజీగూడ గ్రామంతో పాటు మిలింద్ నగర్, భీంనగర్ కాలనీల్లో 69వ ధమ్మ చక్ర పరివర్తన్ దివస్, వర్షవాస్ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సట్వాజీగూడ గ్రామం నుంచి మిలింద్ నగర్ నుంచి బౌద్ధ ఉపాసకులు బుద్ధుడు అతని యొక్క గ్రంథంతో భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి బుద్ధ వందన, ధమ్మ వందన, సంఘ వందన స్వీకరించారు. ఈ సందర్భంగా పూజ్య భంతే కమల్ ధమ్మో మాట్లాడారు. ఇందులో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే జీతేంధర్, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్యాగ్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి : జాన్సన్

ఉట్నూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి కనిపిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలందరూ ఓటుతో ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. ఎవరైనా అసంతృప్తిలో ఉంటే పార్టీకి నష్టం జరగకుండా చూసుకోవాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, అప్పటివరకు ఓపికతో ఉంటూ ప్రభుత్వంపై ప్రజలకు వస్తున్న అసంతృప్తిని ఎండగట్టాలని సూచించారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీల ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేస్తున్నందున త్వరలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్, మాజీ ఎంపీపీ జయవంత్ రావు, మాజీ వైస్ ఎంపీపీ సలీముద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యులు రషీద్, నాయకులు భరత్ చౌహాన్, కాటం రమేష్, ధరణి రాజేష్, సెడ్మాకి సీతారాం, సింగారే భారత్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసానికి గురైన వ్యక్తి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన గాలి ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి సైబర్ మోసానికి గురయ్యాడు. వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ వివరాల ప్రకారం.. గత నెల 26న గాలి ప్రవీణ్ కుమార్ తన స్నేహితుడికి రూ.3,900 ఫోన్‌పే చేయగా.. పొరపాటున వేరే నెంబర్‌కు డబ్బులు పంపాడు. పొరపాటును గుర్తించి సదరు నెంబర్‌కు ఫోన్ చేసి తిరిగి పంపమని కోరగా.. డబ్బులు రీఫండ్ చేస్తామని నమ్మించి బాధితుడి అకౌంట్ నుంచి రూ.62,191 విత్ డ్రా చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పలుచోట్ల కోజాగిరి పౌర్ణమి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : కోజాగిరి పౌర్ణమిని పురస్కరించుకుని ఊరు వాడ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. పాలలో చంద్రబింబం చూసి పాలను సేవించడం పౌర్ణమి ప్రత్యేకతగా నిలుస్తోంది. ఇందుకు అనుగుణంగానే పలు కాలనీలు, గ్రామాల్లో సోమవారం రాత్రి ప్రత్యేక పూజాలు చేశారు. పట్టణంలోని గాంధీ చౌక్ లో స్థానికులు చంద్రబింబాన్ని పాలలో చూసి సేవించారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు.

ప్రారంభమైన 'కాకడ హారతి'

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం ప్రారంబాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాల్లో కాకడ హారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధల నడుమ ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు భక్తులు ఉపవాస దీక్షలను ఆచరిస్తూ, వేకువజామునే ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు జరపనున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని అతి పురాతనమైన శ్రీరామచంద్ర గోపాల కృష్ణ మఠం ఆలయంలో పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కాకడ హారతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు.

రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ సంఘ్ నేతలు మంగళవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి రైతుల సమస్యలపై వినతిపత్రం అందించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బ తిన్న పంటలకు పరిహారం అందించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందులో సంఘ్ అధ్యక్షుడు కృష్ణ రెడ్డి, సెక్రటరీ వెంకట్ రెడ్డి, భూమా రెడ్డి, చిల్కా దయాకర్, ఉమాకాంత్, అశోక్ రెడ్డి, తదితరులున్నారు.

'వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు'

సిరికొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో నివసిస్తున్న వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టొద్దు అని సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని వాయిపేట్ సెక్షన్ అధికారి సత్తయ్య అన్నారు. మండలంలోని రిమ్మ గ్రామంలో మంగళవారం వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాటి నివాసాలను రక్షించి జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ అటవీశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. పంట పొలాల చుట్టూ కరెంట్ తీగలు, ఉచ్చులు పెట్టొద్దన్నారు. వాటి ఆవాసాలైన అడవులను నరకొద్దని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందూర్ అమృత్ రావ్, గ్రామ పటేల్ శంకర్, బీట్ అధికారులు సంతోష్, హీరాలాల్, బేస్ క్యాంప్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అటవీ శాఖ అధికారులు, ప్రజలు

'స్థానికం'లో గెలుపే కాంగ్రెస్ లక్ష్యం : కంది

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని, అత్యధిక జడ్పీటీసీ, యంపీటీసీ స్థానాలను పార్టీ కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం తన క్యాంపు యాల్లోయంలోని సమావేశ మందిరంలో మండలాల ముఖ్యనాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. సాత్నాల, ఆదిలాబాద్ రూరల్, మావల మండల నాయకులతో భేటీలో పలు అంశాలపై చర్చించారు. ఆ తర్వాత కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలోకి పలువురు నాయకులు చేరారు.

రైతులకు శిక్షణపై ఆసక్తి కరువాయే!

బోథ్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో నూతన వ్యవసాయ పద్ధతులతో పాటు ప్రభుత్వం పంట విక్రయాలపై తీసుకవస్తున్న వివిధ రకాల యాప్‌లపై అవగాహన కలిగించేందుకు గాను ప్రతి మంగళవారం బోథ్‌లోని రైతువేదికలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి కేవలం 15 మంది రైతులు మాత్రమే హాజరయ్యారు. మండల కేంద్రంలో దాదాపు 1500 మంది వరకు రైతులు ఉండగా.. 15 మంది మాత్రమే హాజరయ్యారు. ఏఈఓలు ఈ విషయమై ముందుగా వివరించిన గైరాజర్ పట్ల అంతర్యం ఏమిటి అనేది అంతు పట్టడం లేదు.

తాంసి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

తాంసి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ మండలాలలో గ్రామ స్థాయిలో ప్రజలతో మంచి సత్సంబంధాలను ఏర్పరచుకొని ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగిన కార్యాచరణను రూపొందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం రాత్రి తాంసి పోలీస్ స్టేషన్‌ను అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో ఉంచుకోవాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడుతూ రానున్నది ఎన్నికల సమయమని పూర్తి సంసిద్ధంగా ఉండాలని అన్నారు. గ్రామాలను సందర్శిస్తూ వీపీవో విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, గ్రామాలలో జరిగే అసాంఘిక కార్యకలాపాల పట్ల, సామాజిక కార్యకలాపాల పట్ల పూర్తి సమాచారం రాబట్టేలా పటిష్టమైన సమాచార వ్యవస్థను నిర్మాణం చేసుకోవాలని సూచించారు. గ్రామాలను సందర్శిస్తూ గ్రామాలలో ప్రజలకు గంజాయి మాదకద్రవ్యాలు సైబర్ క్రైమ్ చైల్డ్ మ్యారేజ్ ఉమెన్ హరాస్మెంట్ లాంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యపరచాలని సూచించారు. ముఖ్యంగా యువతకు చదువుకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేసి ఉన్నత లక్ష్యాలను అభ్యసించేలా ప్రోత్సహించాలని తెలిపారు. సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ బాధితుల సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలని అన్నారు. వెంటనే సిబ్బంది బాధితులలో పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంపొందించే దిశగా కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు సమీకరిస్తూ ఉండాలని ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని సూచించారు. ప్రతిరోజు సాయంత్రం సమయంలో వాహనాల తనిఖీ చేస్తూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎస్పీ ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కె ఫణిందర్, తాంసి ఎస్ఐ ఎస్ జీవన్ రెడ్డి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాత ఫోన్ల విక్రయాలు!

బోథ్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొంతమంది బయట వ్యక్తులు పాత సెల్‌ఫోన్‌లను మరమ్మతులు చేసి కొత్త ఫోన్‌లంటూ బోథ్‌లో విక్రయిస్తున్నారు. అయితే విషయం పసిగట్టిన సెల్ ఫోన్ దుకాణం యజమానులు బోథ్ డెవలప్‌మెంట్ ఫోరం వాట్సాప్ గ్రూపులో ప్రజలను అప్రమత్తం చేశారు. పాత సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన ఓ వ్యక్తి సెల్ ఫోన్ దుకాణానికి తీసుకువెళ్లి చూపించగా పాత ఫోన్‌లోనే మరమ్మతు చేసి విక్రయిస్తున్నారని గమనించడం జరిగింది. విక్రయదారులు బినామీ అడ్రస్‌ల పైన బిల్లులు సైతం ఇస్తున్నట్లు తెలిసింది. అమాయక ప్రజలను టార్గెట్‌గా చేసి ఈ విక్రయాలు జరుపుతున్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

ఇంద్రవెల్లి/ఉట్నూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం అయిన ఘటన మంగళవారం ఇంద్రవెల్లి మండలంలోని వడగామ్ సమీపంలో జరిగింది. 108 అంబులెన్స్ ఈఎంటీ రాజశేఖర్, పైలెట్ రవీందర్‌ల వివరాల ప్రకారం.. మండలంలోని కన్నాపూర్ తండాకు చెందిన పూర్ణ అనే గర్భిణికి పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. తరలిస్తుండగా మార్గమధ్యలో వడగాం గ్రామ సమీపంలో ఆడబిడ్డకు జన్మనిచ్చిందని తెలిపారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు.

పరశురాం మృతి తీరని లోటు

నేరడిగొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జాదవ్ పరుశురాం మృతి తీరని లోటని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వాగ్ధారి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పరశురాం తేర్వి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏకగ్రీవ ఎంపీటీసీ కోసం కనుగుట్ట వాసుల చర్చ

బోథ్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుగుట్ట గ్రామానికి ఎంపీటీసీ ఎస్సీ రిజర్వుడు కావడంతో ఆ గ్రామస్థులు ఆ స్థానంలో పోటీకి ఎవరు దిగకుండా ఏకగ్రీవంగా ఎంపీటీసీని ఎన్నిక చేసుకోవాలని చర్చించుకున్నట్లు సమాచారం. మంగళవారం సమావేశమైన గ్రామస్థులు ఈ విషయమై తీర్మానించుకున్నట్లు తెలిసింది. పార్టీలకతీతంగా అభ్యర్థిని ఎంపీటీసీగా గ్రామం నుంచి పంపించాలని చర్చించుకున్నట్లు తెలిసింది. ఒకప్పుడు రాజకీయ పోరులో ఆరితేరిన కనుగుట్ట గ్రామస్థులు ఏకగ్రీవం వైపు అడుగులు వేస్తూ ఉంటే ఇతర గ్రామాల ప్రజలకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అంటున్నారు.





ముఖాముఖి

వరి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్

ప్ర: జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వరి సాగయ్యింది?

జ: జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,30,000 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు.

ప్ర: ధాన్యం సేకరణ లక్ష్యం ఎంత?

జ: ఎకరానికి 18 క్వింటాళ్ల చొప్పున 2.34 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఇందులో స్థానిక అవసరాలు, సీడ్ కోసం 88వేల మెట్రిక్ టన్నులు పోను 1.46లక్షల ఎంటీఎస్ ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నాం.

ప్ర: ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నారు?

జ: గత రబీ మాదిరిగానే ఈసారి కూడా జిల్లాలో 351 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం.

ప్ర: ఎప్పటిలోగా సెంటర్లను ప్రారంభిస్తారు?

జ: ప్రస్తుతం వరి పంట గింజ దశలో ఉంది. ఈ నెల చివరి వరకు కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. పంట దిగుబడి వచ్చిన ప్రాంతాల వారీగా ప్రాధాన్యత క్రమంలో వచ్చే నెల మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

ప్ర: గన్నీ బ్యాగుల కొరతను ఎలా అధిగమిస్తారు?

జ: జిల్లాలో వరి కొనుగోళ్ల కోసం దాదాపు 50 లక్షల గన్నీబ్యాగులు అవసరం అవుతాయి. ప్రస్తుతం 25లక్షల బ్యాగులు సిద్ధంగా ఉన్నాయి. మిల్లర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న బ్యాగులను అప్పగించాలని ఆదేశించాం. సెంటర్లను ప్రారంభించే నాటికి పూర్తిస్థాయిలో గన్నీబ్యాగులను అందుబాటులో ఉంచుతాం.

ప్ర: సన్న వడ్లకు బోనస్ చెల్లిస్తారా?

జ: గత వానకాలం సీజన్‌లో సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించింది. కొనుగోలు చేసిన వడ్లకు సంబంధించిన మద్దతు ధర డబ్బులను ధాన్యం విక్రయించిన రెండుమూడు రోజుల్లో రైతు ఖాతాల్లో జమచేస్తాం. బోనస్ డబ్బులను మాత్రం ప్రభుత్వం ప్రత్యేకంగా విడుదల చేస్తుంది.

ప్ర: కొనుగోళ్లపై రైతులకు మీరు ఇచ్చే సూచన?

జ: రైతులు తమ పంట దిగుబడిని దళారులకు అమ్మి మోసపోవద్దు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి.

• నిర్మల్, ఆంధ్రజ్యోతి

సమీక్షలతో సన్నద్ధత

- ఏకాభిప్రాయంతో కాంగ్రెస్ పార్టీ
- జడ్పీటీసీ అభ్యర్థిత్వాలపై కసరత్తు షురూ
- ఇన్‌చార్జీ మంత్రి సూచనలతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ
- మండలాల వారిగా అభ్యర్థిత్వాలపై సమీక్షలు నిర్వహిస్తున్న బీజేఎల్పీ నేత
- తగ్గేదేలే అంటున్న బీఆర్‌ఎస్



నిర్మల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు జరగబోయే ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు అన్ని సమీక్షలతో సన్నద్ధతకు సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు జిల్లాలో దూకుడు మీదున్న బీజేపీ అలాగే గత ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ పార్టీ సైతం పోటాపోటీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల వైపు తమ కేడర్‌ను సంసిద్ధులను చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. సోమవారం జిల్లాఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌పార్టీ ముఖ్యనేతలతో కీలక సమీక్ష సమావేశం నిర్వహించి నాయకులంతా ఐక్యంగా ఉంటూ అభ్యర్థుల ఎంపిక నుంచి వారి గెలుపు వరకు సమిష్టి బాధ్యతను తీసుకోవాలని ఆదేశించిన వ్యవహారం ఆ పార్టీలో ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. జిల్లాఇన్‌చార్జీ మంత్రి జారీ చేసిన ఆదేశాలు కాంగ్రెస్ పార్టీలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఆ పార్టీ నాయకులంతా తమ బేధాభిప్రాయాలను పక్కన పెట్టి ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేపడతామని అలాగే గెలుపు బాధ్యతలను సైతం తామే తీసుకుంటామంటూ స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగానే ప్రతీ మండలం నుంచి జడ్పీటీసీ అభ్యర్థులకు సంబంధించిన నలుగురు సీనియర్ నాయకుల పేర్లను అధిష్టానానికి పంపేందుకు నిర్ణయించారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల కోసం ముందస్తు సమీక్షలు నిర్వహించిన వ్యవహారంతో బీజేపీ సైతం అప్రమత్తమైంది. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన కేడర్‌ను స్థానిక ఎన్నికల కోసం సిద్ధం చేసేందుకు రంగంలోకి దిగడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. మహేశ్వర్ రెడ్డి మంగళవారం రోజంతా నిర్మల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలు, సీనియర్ కార్యకర్తలతో సీరియస్‌గా మంతనాలు కొనసాగించడం చర్చకు తావిస్తోంది. బలమైన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులపైనే ఆయన తన సమీక్షలో ఆరా తీసినట్లు చెబుతున్నారు. ప్రతి మండలం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులుగా బలమైన నేతలను రంగంలోకి దింపాలన్న పట్టుదలతో ఎమ్మెల్యే ఉన్నారు. ప్రస్తుతం నిర్మల్‌తో పాటు ముథోల్ నియోజకవర్గంలో బీజేపీ అత్యంత బలంగా ఉన్న అంశాన్ని ఆయన పరిగణలోకి తీసుకుంటూ కేడర్‌ను ఆ దిశగా సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సైతం తిరిగి తన సత్తాను చాటుకునేందు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముఖ్యంగా ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీలకు గట్టి పోటీనిచ్చి తన అస్థిత్వాన్ని కాపాడుకునే దిశగా బీఆర్ఎస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది.

జూపల్లి ఆదేశాలతో హస్తంలో కదలిక

జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో పార్టీ సీనియర్ నేతల్లో పార్టీలో కదలిక మొదలైంది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు తమ మధ్య నెలకొన్న బేధాభిప్రాయాలను పక్కన పెట్టేందుకే కాకుండా ఐక్యంగా అభ్యర్థుల ఎంపిక గెలుపు లక్ష్యాన్ని సాధించేందుకు నిర్ణయించారు. అయితే ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి స్థానిక ఎన్నికల గెలుపుపై స్పష్టమైన హెచ్చరికలు జారీచేయడంతో కాంగ్రెస్‌పార్టీ నేతలంతా అప్రమత్తమవుతూ తమ మనుగడను నిలుపుకునే ప్రయత్నాలు మొదలుపెడుతున్నారు. దీనికోసం ఒక్కో మండలం నుంచి నలుగురు బలమైన అభ్యర్థుల పేర్లను అధిష్టానానికి ప్రతిపాదిస్తున్నారు. అభ్యర్థుల తుది ఎంపికను అధిష్టానమే నిర్ణయించనుందంటూ అధిష్టానం ఏ అభ్యర్థి పేరు ఖరారుచేసిన తామంతా కలిసి కట్టుగా గెలుపుకోసం కృషిచేస్తామని స్పష్టం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఈ పరిణామాలు కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ముఖ్యంగా నిన్న మొన్నటివరకు నేతల బేధాభిప్రాయాల కారణంగా అయోమయానికి లోనవుతున్న కాంగ్రెస్ కేడర్‌కు ఈ పరిణామాలు సంబురపరుస్తున్నాయి.

ఏలేటీడైరెక్షన్‌లో బీజేపీ

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన నిర్మల్ నియోజకవర్గంపైనే కాకుండా ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాలపై దృష్టి సారిస్తూ పార్టీ కేడర్‌తో సీరియస్‌గా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. మంగళవారం మహేశ్వర్ రెడ్డి రోజంతా జిల్లాలోని 18 మండలాల పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలతో సీరియస్‌గా సమీక్షలు నిర్వహించడం రాజకీయ ప్రాధాన్యతకు కారణమవుతోంది. 18 మండలాల్లో పార్టీ బలా బలాలు, బలహీనతలపై అలాగే అభ్యర్థిత్వాలపై మహేశ్వర్ రెడ్డి నేతలతో సీరియస్‌గా చర్చించారు. 18 మండలాల నుంచి బలమైన అభ్యర్థులను జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులుగా బరిలోకి దింపాలని ఆయన నిర్ణయించారు. మరో రెండు రోజులు ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఇదే అంశంపై కసరత్తు చేయనున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీని ఓడించి బీజేపీ సత్తా చాటడమే కాకుండా తన ఇమేజ్‌ను సైతం రెట్టింపు చేసుకోవాలని ఆయన భావిస్తున్నట్లు చెబుతున్నారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్‌లతో ఆయన సీరియస్‌గా మంతనాలు జరుపుతూ వారి నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందు కోసం సిద్ధం చేయాలంటూ సూచిస్తున్నారు. పార్టీనేతలు, కేడర్‌ను ఏకతాటిపై నిలిపి జిల్లాలోని మెజార్టీ జడ్పీటీసీ స్థానాలతో జడ్పీ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవాలన్నదే మహేశ్వర్ రెడ్డి టార్గెట్‌గా నిర్ణయించుకున్నారంటున్నారు.

అస్థిత్వం కోసం బీఆర్‌ఎస్ ఆరాటం

రెండేళ్ల క్రితం వరకు అధికారంలో ఉండి చక్రం తిప్పిన బీఆర్ఎస్ తిరిగి తన అస్థిత్వాన్ని నిలుపు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతోఇంతో బలంగాఉన్న ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాలపై ప్రస్తుతం ఆ పార్టీ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించబోతోంది. ఇందులో భాగంగానే ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలుసైతం సీనియర్ నేతలు, కేడర్‌తో ఇక సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. కనీస సంఖ్యలో జడ్పీటీసీ స్థానాలను దక్కించుకొని తిరిగి తమ ఉనికిని కాపాడుకోవాలన్నదే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంటోంది. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న కేడర్‌ను క్రియాశీలకం చేయాలని అలాగే కాంగ్రెస్, బీజేపీల్లోని అసంతృప్తి నేతలను సైతం తమ పార్టీలోకి రప్పించుకునేందు ప్రయత్నాలు చేస్తోంది.



ఇందిరమ్మ చీరలను గోదాంలో డంప్ చేస్తున్న దృశ్యం

ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు వచ్చేశాయ్

దిలావర్‌పూర్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు ఎట్టకేలకు వచ్చాయి. బతుకమ్మకు అందుతాయనుకున్న చీరలు రావడంలో జాప్యం జరిగింది. దీంతో చీరలపై మహిళలు ఆశలు వదులుకున్నారు. అయితే ఎట్టకేలకు చీరలు రావడంతో చీరల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. మండలానికి 8,810 ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు చేరుకున్నట్లు ఐకేపీ ఏపీఎం బోసు తెలిపారు. పంపిణీపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు. ఆదేశాలు రాగానే చీరలను పంపిణీ చేస్తామన్నారు. అయితే ఇందిరమ్మ జయంతి రోజైన నవంబరు 19న చీరలను పంపిణీ చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కలెక్టర్ పేరుతో నకిలీ వాట్సాప్

నిర్మల్ రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కలెక్టర్ పేరు, ఫొటోతో ఓ నకిలీ వాట్సాప్ అకౌంట్ సృష్టించారు. 66958518330 నెంబర్‌తో వివిధ వ్యక్తులు, అధికారులకు మెసేజ్‌రావడంతో ఉదాంతం వెలుగుచూసింది. ఈనెంబర్ పూర్తిగా మోసపూరితమైందని, దీన్ని నమ్మి ఎవరూ మోసపోవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లా ప్రజలకు కోరుతూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డబ్బులు జమ చేయాలని కోరితే వెంటనే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఓటు చోరీపై నేటి నుంచి సంతకాల సేకరణ

నిర్మల్ రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేటి నుంచి సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తెలిపారు. బుధవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో, సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి, వంజర్, లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్, వడ్యాల్, మామడ మండలకేంద్రంలో సంతకాల సేకరణ చేపడతామని, దీనికి పీసీసీ ప్రధానకార్యదర్శి రాంభూపాల్ హాజరవుతారని తెలిపారు.

రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి

బాసర, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, గోదావరి నది ఉధృత ప్రవాహంతో బాసర మండలంలోని 10 గ్రామ పంచాయతీల రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ కిమరణ్‌కొమ్రేవార్ అన్నారు. మంగళవారం ఆయన రైతులను పరామర్శించిన అనంతరం మాట్లాడారు. ముందుగా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బాసరలో రైతులను కలిసి త్వరలో నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదని అన్నారు. చేతికొచ్చిన పంటను కోసుకొని ఇంటికి తీసుకెళ్లేలోపే వర్షాలతో నీట మునిగి పోయింది. ప్రభుత్వం తక్షణమే ఎకరాకు రూ.12వేల నష్టపరిహారం ప్రకటించడంతోపాటు సోయా పంట క్వింటాకు రూ.5వేల ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా రైతులకు ఎకరానికికి రూ.15వేలను అందిస్తే దీపావళికి రైతులు సంతోషంగా జరుపుకోగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాసర మండల కన్వీనర్ కోర్వశ్యామ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నూకం రామారావు, పార్టీ సీనియర్ నాయకుడు జి. గంగారావు, మాజీ ఎంపీపీ వోని నర్సింగ్‌రావు, తదితరులున్నారు.

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

» కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో అమలుచేస్తున్న బాలశక్తి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దశలో భాగంగా జిల్లాలోని కేజీబీవీలలో విజయవంతంగా బాలశక్తి కార్యక్రమాన్ని అమలుపరిచామన్నారు. అదేవిధంగా జడ్పీ పాఠశాలల్లో రెండో దశలో భాగంగా బాలశక్తి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు పూర్తి చేసిన వైద్య పరీక్షల వివరాలు మండలాల వారీగా సమీక్షించారు. విద్యార్థులందరికీ రక్తహీనత, థైరాయిడ్, పోషక లోపాల గుర్తింపు, తదితర వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో లోపాలు గుర్తిస్తే, వారికి ప్రత్యేక పోషక ఆహారంతో పాటు అవసరమయ్యే మందులను ఇవ్వాలన్నారు. అన్ని వివరాలు వారి హెల్త్ కార్డుల్లో నమోదు చేస్తూ ఉండాలన్నారు. విద్యార్థుల పోషకులతో సమావేశాలు నిర్వహించినప్పుడు వారి ఆరోగ్య విషయాలు పోషకులకు వివరించాలన్నారు. ఒత్తిడిని అధిగమించుట, గుడ్-టచ్, బ్యాడ్-టచ్, మానసిక ఆరోగ్యం, తదితర అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా బ్యాంకు అధికారులు బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వయంగా బ్యాంకులకు విద్యార్థులను తీసుకువెళ్లి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, సామాజిక అంశాలపై విద్యార్థులకు అన్ని వివరాలు తెలిసేలాగా ప్రభుత్వ కార్యాలయాలకు, వైజ్ఞానిక యాత్రలకు తీసుకెళ్లాలని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో భోజన్న, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో రాజేందర్, ఎల్డీఎం రామ్‌గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో సభ్యులు

నిర్మల్‌రూరల్: కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సభ్యులందరికీ దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరూ సమన్వయంతో, నిబద్ధతతో పని చేసి ప్రజాసేవలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

కుంటాల, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించబోయే ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం కుంటాలతోపాటు పలు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్‌లను స్థానిక ఎంపీడీవో వనజ, ఎంపీవో రహీంలు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వృద్ధులకు వీల్‌చైర్ ద్వారా వెళ్లేందుకు, సిబ్బందికి అవసరమైన టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానిక సిబ్బందికి సూచించారు.

జాతీయ సమావేశాలకు తపస్ నాయకులు

నిర్మల్‌రూరల్ అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో జరుగుతున్న అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ 9వ జాతీయ సమావేశాలకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నిర్మల్ జిల్లా ప్రతినిధులు హాజరయ్యారు. సభలో నూతన జాతీయ విద్యావిదానం, ఉత్తమఉపాధ్యాయుడు, విలువలతో కూడిన విద్య, పాఠశాలల వికాసం అంశాలపై చర్చించారు. సమావేశానికి జిల్లా నుంచి రాష్ట్ర, జిల్లా ప్రతినిధులుగా శశిరాజ్, జిలకరి రాజేశ్వర్, నవీన్ కుమార్, సుదర్శన్, చంద్రప్రకాష్ జైస్వాల్, ఆర్. రాజేశ్వర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



నివాళులర్పిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ఘనంగా వాల్మీకి జయంతి

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి రచనల్లోని విలువలను అందరూ పాటించాలని పేర్కొన్నారు. వేడుకల్లో ఆర్డీవో రత్న కళ్యాణి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, మత్స్యశాఖ ఏడీ రాజనర్సయ్య, పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్‌సింగ్ ఉన్నారు.

వాల్మీకి జీవితం మార్పుకు ప్రేరణ: ఎస్పీ

వాల్మీకి జీవితం ప్రతీ మనిషిలో మార్పుకు ప్రేరణ ఇస్తుందని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం పర్గత్ దివస్ సందర్భంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఏవో యూనస్ అలీ, ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు, డీపీవో ఉన్నారు.

ముథోల్‌లో..

ముథోల్: ముథోల్‌లో ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిల్, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు జీవన్, టి. రమేష్, విఠల్, సాయిప్రసాద్, పోతన్న, గ్రామస్థులు, వీడీసీ సభ్యులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, తదితరులున్నారు.



ఓలాలో వాల్మీకి జయంతిలో పాల్గొన్న గ్రామస్తులు

కుంటాలలో..

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల బోయ సంఘం అధ్యక్షుడు బొమ్మెన రాములు, ఉపాధ్యక్షుడు దాసురఘురాం, కోశాధికారి చిన్న గజ్జారాం, కార్యదర్శి గజ్జారాం, గ్రామస్తులు తదితరులున్నారు.

ఎన్నికల నియమావళిపై గ్రామస్థులకు అవగాహన

నిర్మల్‌రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూతాపూర్, అక్కాపూర్ గ్రామాల్లో గ్రామస్థులకు స్థానిక సంస్థల ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా గొడవలు కొట్లాటలకు దూరంగా ఉండాలని, అందరూ సోదరభావంతో మెలగాలని, ఎన్నికలను ప్రశాంతంగా ఎటువంటి గొడవలు లేకుండా సజావుగా నిర్వహించేలా అందరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రజలకు రక్షణ, భద్రత కలిగించడమే పోలీసుల ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

నర్సాపూర్(జి), అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఈవేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో బతుకమ్మ పాటలు, నృత్యాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సరస్వతి, మాధవి, శ్వేత, ప్రశాంతి, వనజ, ఇంద్రజ, గంగామణి, వేదశ్రీ, తేజస్విని, ప్రణతి వంటి యువతులు ఆలపించిన బతుకమ్మ పాటలు, వారి నృత్య ప్రదర్శనలు పండుగ శోభను రెట్టింపు చేశాయి. వారి ప్రతిభ, పాటల మాధుర్యం అక్కడకు విచ్చేసిన ప్రజలందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఈ 'ముత్యాలు' (యువతులు) అందరినీ అలరించి, పండుగ స్ఫూర్తిని పెంపొందించారు. ఆర్యవైశ్య సంఘం పెద్దలు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేశారు.

ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలి

» ఎన్‌పీడీసీఎల్ ఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన విద్యుత్‌సేవలు అందివ్వాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో టీజీ ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి విద్యుత్ శాఖ అధికారులు, ఆ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ వినియోగంపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కొత్తవిద్యుత్ ఉపకేంద్రాలు, విద్యుత్ లైన్లు అవసరముంటే వెంటనే తమకు ప్రతిపాదనలు పంపాలన్నారు. అటవీప్రాంతాల్లో నూతన విద్యుత్ కేంద్రాల నిర్మాణం, విద్యుత్ స్తంభాల స్థాపన, తదితర నిర్మాణాల విషయంలో అటవీ



మాట్లాడుతున్న కర్నాటి వరుణ్ రెడ్డి

అనుమతులు వీలైనంత త్వరగా పొందాలన్నారు. అటవీ అధికారులతో సమన్వయ పర్చుకోవాలని సూచించారు. నిర్మాణాలకు సంబంధించి వ్యయ అంచనాలు సిద్ధం చేసి నివేదికలు పంపాలన్నారు. నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ వేగవంతంగా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. అవస రమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని, రైతాంగానికి, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఉండేలా ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పంట కోతలు పూర్తవ్వగానే అవసరమైన చోట పంట పొలాల్లో నూతన విద్యుత్ లైన్లు, మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రజలకు, రైతాంగానికి అనవసర కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ మరమ్మతులు, విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా భద్రతా పరికరాలు ధరించాలని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పీసీసీ చీఫ్‌తో మాట్లాడుతున్న విఠల్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

భైంసా, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పీసీసీ చీఫ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ ముథోల్ నియోజకవర్గ తాజా రాజకీయ పరిస్తితులు, కాంగ్రెస్ పార్టీ స్థితిగతులు, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర వివరాలపై ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో చర్చించినట్లుగా సమాచారం. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ ముథోల్ మాజీ ఎమ్మెల్యేతో మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ ప్రతినిధులు, శ్రేణులన్నీ సమన్వయం, సమిష్టిగా కృషి చేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించినట్లుగా తెలిసింది. ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక చేపట్టాలని పేర్కొన్నట్లుగా తెలిసింది.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

కుబీర్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పురంశెట్టి రవికుమార్ అన్నారు. మండలంలోని రాజురా గ్రామానికి చెందిన ప్రేరణ, రాఖీ, పల్సి గ్రామానికి చెందిన అపర్ణ అనే విద్యార్థులు నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్‌కు ఎంపిక అయ్యారు. వీరికి మంగళవారం కుబీర్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ మాజీ ముథోల్ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్ వర్గం నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకుడు పురంశెట్టి రవి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బషీర్ పటేల్, బంకబాబు, సందీప్ దుగ్గే, హన్మండ్లు, వెన్నెల సతీష్, ఉన్నారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం